క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లెలోని సుంకులమ్మపేటలో వెలసిన శ్రీసుంకులమ్మ పరమేశ్వరి ఆలయ 16వ వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకులమ్మ పరమేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అవవ వారిని భక్తులు దర్శించుకుని కాయ కర్పూరాలు సమర్పించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వైభవంగా పీర్ల ఊరేగింపు



వేంపల్లెలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

వేంపల్లి : వేంపల్లెలో గ్రామ పురవీధుల గుండా పీర్లను ఊరేగించారు. శనివారం మొహరం పండగ సందర్భంగా బొడ్డు చావిడి వీధిలోని మౌలాలి సాహెబ్ పీర్లు, బిడాలమిట్ట వీధిలోని మదర్షావలి పీర్లు, వీరన్న గట్టుపల్లెలోని హుస్సేన్ పీరా పీర్లు, చింతలమడుగుపల్లెలోని ఇమామ్ ఖాసీం పీర్లను ఊరేగించారు. అనంతరం పీర్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారికి చక్కెరను చదివించారు. రాత్రికి అగ్ని గుండ ప్రవేశం నిర్వహించారు. ఆదివారం ఉదయం జల్దీ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

లింగాల : మండల కేంద్రమైన లింగాలలో శనివారం పెద్ద సరిగెత్తు సందర్భంగా పీర్లను ఊరేగింపు నిర్వహించారు. దిగువ లింగాల, ఎగువ లింగాల గ్రామాల్లో డప్పు వాయిద్యాల మధ్య పీర్లను ఊరేగింపు చేశారు. ఇంటింటా పీర్లకు భక్తులు చక్కెర చదివింపులు ఇస్తూ ఊరేగింపు నిర్వహించారు. మంగళవారం మొహర్రం పండుగను నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నామని ముజావర్లు తెలిపారు.

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని పెద్ద పోస్టాపీస్, గూడుమస్తాన్ వలీ దర్గా ఆవరణం, మిఠాయిగిరి వీధిలో మొహర్రం వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. రాత్రి 11 గంటలకు పీర్లతో భక్తులు అగ్నిగుండంలో ప్రవేశించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కమలాపురం : స్థానిక ఎస్‌బీఐ ఎదుట ఉన్న పరి చిన్న పిల్లల హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు సయ్యద్ ఫారుక్ హుసేన్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని వారు అందులో తెలిపారు. సమీప ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉచిత వైద్య సేవలు పొందాలని వారు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జమ్మలమడుగు : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ బొలిశెట్టి ప్రసాద్ తెలిపారు. శనివారం మండలంలోని గొరిగెనూరు గ్రామ సచివాలయంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల ఉచ్చులో పడకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. సమస్యలు వచ్చినప్పుడు ప్రజలు వెంటనే బ్యాంక్ అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ అధికారులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

జమ్మలమడుగు రూరల్ : స్మార్ట్ మీటర్లను రద్దు చేసి ప్రజలపై పడుతున్న విద్యుత్ భారాన్ని వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మూలే వెంకటసుబ్బారెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ సీపీఐ నాయకులు ఏడీ రాజగోపాల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల విద్యుత్ బిల్లులు అధికంగా వస్తాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగు సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి రాంప్రసాదుకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రొద్దుటూరు క్రైం : ప్రభుత్వ స్కీం కింద పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్, ప్రభుత్వ ఆస్పత్రి యూనియన్ గౌరవ అధ్యక్షుడు రాఘవ కోరారు. శనివారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్‌కు వారు వినతి పత్రం అందించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులు ఈనెల 9న సమ్మెలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రత్నమ్మ, కళావతి, నరసింహులు, గంగాధర్, మహేష్, దస్తగిరి, ప్రసాద్, మరియమ్మ, దేవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లతో దెబ్బతింటున్న పత్తి పంట

- బొలాల్లో నిలువునా ఎండుతున్న ఫైనం
- దిగుబడులపై ప్రభావం చూపుతున్న తెగుళ్లు
- ఆందోళనలో పత్తి రైతులు



తెగులుతో ఎర్రగా మారి ఎండుతున్న పత్తి పంట



తోటలో ఎండుతున్న కాయలతో ఉన్న పత్తి చెట్లు

వేముల : ఈ ఏడాది వేసవి పత్తి పంటపై రైతులు పెట్టుకున్న ఆశలన్ని ఆడియాశలవుతున్నాయి. వేసవిలో సాగు చేసిన పత్తి పంట ఆశాజనకంగా ఉండటంతో దిగుబడులు ఉంటాయని రైతులు ఆశించారు. అయితే అనుకోని రీతిలో పత్తి పంటకు తెగుళ్ల సోకడంతో దిగుబడులు తగ్గి నాణ్యత ఉండదనే ఉద్దేశ్యంతో రైతులలో నిరాశ అలుముకుంది. పత్తికి సోకిన తెగులుతో పంట పూర్తిగా ఎండిపోతుండటంతో సాగులో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడులు అవుతున్నా.. ఆదాయం ఉంటుందనే

పత్తి సాగులో కూడా ఈ ఏడాది పెట్టుబడులు పెరిగిపోయాయి. సాగులో ఎకరాకు రూ.40 వేలకుపైనే పెట్టుబడులు అవుతున్నాయని రైతులు అంటున్నారు. పత్తి సాగు మొదలు దిగుబడులు పూర్తయ్యేవరకు పెట్టుబడులు అవుతున్నాయి. ఒకసారి పెట్టుబడులు పెడితే దిగుబడులు వచ్చే పరిస్థితి లేదు. సాగు ఆరంభం నుంచే విత్తనాలు, ఎరువులు, కలుపు తీయడం, ముఖ్యంగా తెగుళ్ల సోకకుండా ముందు జాగ్రత్తగా మందులు పిచికారి చేయడం వంటి అదనపు ఖర్చులతో పెట్టుబడులు అవుతున్నాయని రైతులు అంటున్నారు. అంతేకాక పత్తి తీసే సమయంలో కూలీల ఖర్చు ఉంటోందని, కూలీ రేట్లు పెరిగితే పెట్టుబడులు కూడా పెరుగుతాయని రైతులు చెబుతున్నారు.

నియోజకవర్గంలో 8వేల ఎకరాలకుపైనే

పులివెందుల నియోజకవర్గంలో వేసవి పత్తి సాగు విస్తీర్ణం పెరిగింది. ఈ ఏడాది నియోజకవర్గ వ్యాప్తంగా 8వేల ఎకరాలకుపైనే పత్తి సాగైంది. నియోజకవర్గంలోని వేముల, వేంపల్లె మండలాల్లో అత్యధికంగానూ, మిగిలిన మండలాల్లో అక్కడక్కడ రైతులు సాగు చేసుకున్నారు. ఎక్కువగా వ్యవసాయ బోర్లు బావుల కింద వేసవి పంటగా పత్తిని సాగు చేసుకున్నారు. మార్చి మొదటి వారం నుంచే పత్తి పంటను సాగు చేసుకున్నారు. ముఖ్యంగా ఈ ఏడాది వేసవి ఎండల ప్రభావం పత్తి పంటపై చూపలేదు. ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో ఆడపాదడపా వర్షాలు పడటంతో వేసవి ప్రభావం లేకుండాపోయింది. దీంతో పత్తి బాగా ఏపుగా పెరిగి ఆశాజనకంగా కనిపించింది. అయతే తెగులు సోకడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

నిలువునా ఎండుతున్న పత్తి పంట

వేసవి పంటగా సాగు చేసుకున్న పత్తి తెగుళ్లతో నిలువునా ఎండిపోతోంది. మొక్క కింద భాగం నుంచి ఆకులు ఎర్రగా మారి పైకి పోవడంతో చెట్టు ఎండిపోతోంది. పత్తి కాయలతో ఉన్న పత్తి మొక్కలు ఎండిపోతుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. అలా ఎండిన మొక్కలు నుంచి తీసిన పత్తి తేలికగా ఉంటుందని నాణ్యత లేకపోవడంతో నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. పొలంలో ఒకచోట సోకిన తెగులు పొలమంతా వ్యాప్తి చెంది పత్తి మొక్కలు ఎర్రగా మారి ఎండిపోతున్నాయని రైతులు అంటున్నారు. ఎంత ఖర్చు చేసి మందులు స్ప్రే చేసినా అదుపులోకి రాలేదని, ఆ తెగులు ఏదో తెలియక నివారించుకోలేక సాగులో నష్టపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడులపై తెగుళ్ల తీవ్ర ప్రభావం

పత్తి పంటకు సోకిన తెగులు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వర్షాలతో వేసవి ఎండలు తగ్గి పత్తి ఏపుగా పెరిగి ఆశాజనకంగా ఉండటంతో ఎకరాకు 13 నుంచి 16 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయని రైతులు ఆశించారు. అయితే తెగులుతో ఎకరాకు 10 క్వింటాళ్లలోపే దిగుబడులు వస్తాయని ఆశిస్తున్నామి, అయితే తెగులు ఉధృతి ఇంకా పెరిగితే ఎకరాకు 8 క్వింటాళ్లకు మించి దిగుబడులు అందే పరిస్థితిలేదని రైతులు అంటున్నారు. సాగులో దిగుబడులు తగ్గి మార్కెట్‌లో ధరలు తగ్గితే పెట్టుబడులు కూడా గిట్టుబాటు అయ్యే పరిస్థితి ఉండదని రైతులు అంటున్నారు. ఇప్పుడిప్పుడే సాగులో దిగుబడులు వస్తున్నాయని, తెగులు ప్రభావం పెరిగితే ఉన్న కాయలు కూడా రాలిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.

సాగులో దిగుబడులు ఆశించిన మేర లేవు



వేసవి పత్తి సాగులో ఆశించిన మేర దిగుబడులు అందే పరిస్థితి లేదు. వర్షాలతోపాటు సకాలంలో నీటి తడులు ఇవ్వడంతో పంట ఏపుగా పెరిగి ఆశాజనకంగా కనిపించింది. అయితే దిగుబడులు ఆరంభంలో తెగులు సోకడంతో దిగుబడులపై ప్రభావం ఉంటోంది.

\- చంద్రమోహన్‌రెడ్డి, పత్తి రైతు, గొందిపల్లె

పత్తి సాగులో తీవ్రంగా నష్టపోతున్నాం



వేసవి పత్తి సాగుపై పెట్టుకున్న ఆశలన్ని అడియాశలయ్యాయి. తెగులు సోకడంతో పత్తి సాగులో తీవ్రంగా నష్టపోతున్నా. వేలకు వేలు పెట్టుబడులు పెట్టి దిగుబడులు బాగా ఉంటాయని ఆశించాం. తెగులు సోకడంతో సాగులో దిగుబడులు తగ్గాయి.

\- రాఘవరెడ్డి, పత్తి రైతు, వేముల

నేడు ప్రముఖ న్యూరో సర్జన్ రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతి కుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. పై సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. అలాగే దినేష్ మెడికల్ సెంటర్‌లో నూతనంగా డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించామని, కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పంటల బీమా చెల్లించండి

తొండూరు : రైతులు సాగు చేసిన పంటలకు గడువులోగా పంటల బీమా చెల్లించాలని మండల వ్యవసాయాధికారి కె.రాజు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ బ్యాంకు ద్వారా పంట రుణాలు తీసుకున్న రైతులకు సంబంధించి బ్యాంకు రైతు ప్రీమియం వాటాను డెబిట్ చేసి ప్రీమియం నేరుగా బీమా కంపెనీకి చెల్లిస్తుందన్నారు. ఏదైనా కారణాలవల్ల బీమా అవసరం లేనట్లయితే కటాఫ్ డేట్‌కు రెండు రోజులు ముందు బ్యాంకులకు వెళ్లి లిఖిత పూర్వకంగా అభ్యర్థన పత్రాన్ని సమర్పించాలన్నారు. రుణం తీసుకున్న రైతులు సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్‌లోనూ, సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్, పోస్టాఫీసుల ద్వారా వారి యొక్క ఆధార్, భూమికి సంబంధించి పట్టాదారు పాసుపుస్తకం, కౌలు కార్డు, పంట వేసిన ధృవపత్రం, బ్యాంకు పాసు పుస్తకం సమర్పించి ఆన్‌లైన్ ద్వారా ప్రీమియం చెల్లించి రసీదు పొందాలన్నారు. అలాగే వాతావరణ ఆధారిత బీమా కోసం రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

కార్మిక హక్కులను కాపాడుకుందాం



కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ, భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులు

వేంపల్లె : కేంద్ర ప్రభుత్వం పెంచిన పది గంటల పని విధానం కార్మిక హక్కులను హరించే విధంగా ఉన్నాయని వాటిని రక్షించుకునేందుకు ఈనెల 9న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ పిలుపు నిచ్చారు. శనివారం పట్టణంలో వారు సార్వత్రిక సమ్మెకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే విధంగా కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలలో మార్పులు చేసిందన్నారు. ఆ మార్పులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల పోరాడి సాధించిన 29 చట్టాలలో నాలుగు లేబర్ కోడ్‌లను పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 8 గంటల పనిని 12 గంటలకు పెంచటం, రాష్ట్ర ప్రభుత్వం కూడా 8 గంటల నుంచి 10 గంటలకు పెంచడం దుర్మార్గమన్నారు. కనీస వేతనాలు పెంచాలని కార్మికులు స్కీం వర్కర్లు కోరుతుంటే పెంచకపోగా, కార్మికుల పని గంటలు పెంచడంతో వేతనాలు తగ్గిపోయాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 15 ఏళ్లుగా 74 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్‌లోని కార్మికులకు వేతనాలు సవరించలేదన్నారు. అలాగే కార్మిక సంక్షేమ బోర్డుకు చైర్మన్, కమిటీ సభ్యులను నియమించలేదన్నారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భవన నిర్మాణ సంక్షేమ మండల బోర్డును పునరుద్ధరిస్తామని, కార్మిక అనుకూల విధానాలు తెస్తామని చెప్పి, ఇప్పుడు పెట్టుబడిదారులకు అనుకూల విధానాలు అనుసరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసీ బాదుల్లా, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బళ్లారపు రామాంజనేయులు, మండల కార్యదర్శి బాలాజీ, ఉపాధ్యక్షుడు చలపతి, కోశాధికారి బుజ్జి, నాయకులు బాబావలి, ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీ సెక్యూరిటీ యూనియన్ నాయకులు ప్రసాద్, మల్లేష్‌లు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలి



ఏఈ చాంద్‌బాషాకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

కమలాపురం : పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను తక్షణం తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం ట్రాన్స్‌కో ఏఈ చాంద్‌బాషాకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485 కోట్ల భారం ప్రజలపై మోపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గృహాలకు స్మార్ట్ మీటర్లను బిగించేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని, కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలిచ్చి విద్యుత్ చార్జీల భారాన్ని మోపటం దారుణంగా మోసగించడమేనని ఆయన స్పష్టం చేశారు. అదానితో జరిగిన సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వరప్రసాద్, సుమన్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు



నల్లగొండువారిపల్లెలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

పులివెందుల రూరల్ : నల్లగొండువారిపల్లెలోని గ్రామ ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో రోడ్లపైన ఎక్కడ చూసినా మురుగునీరు ప్రవహిస్తుండటంతో దోమల బెడద ఎక్కువగా ఉందని వారు ఆవేదన చెందుతున్నారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువలు మురుగునీరు, చెత్తాచెదారాలతో నిండి ఉన్నాయి. వాటి గురించి పట్టించుకునేనాథుడే కరువయ్యాడు. అలాగే గ్రామంలో వీధిలైట్లు కూడా వెలగడంలేదని వారు వాపోతున్నారు. గ్రామంలో మురుగు కాలువలు శుభ్రపరిచే వారే కరువయ్యారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు అనేకమార్లు చెప్పినా పట్టించుకోవడంలేదన్నారు. దీంతో కాలువల్లో మురుగునీరు పొంగి ప్రవహిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పెద్దకాంపల్లెలో రీసర్వేపై గ్రామసభ

చింతకొమ్మదిన్నె : మండలంలోని పెద్దకాంపల్లెలో శనివారం తహసీల్దార్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. గ్రామసభకు గ్రామ రైతులకు ముందస్తుగా సమాచారం ఇచ్చి సభలో రీసర్వే జరిపిన మేరకు ఏర్పాడబోయే 157 ఎల్.పి.ఎం.లను, వాటిలోని భూముల వివరాలను బహిరంగంగా చదివి రైతులకు, హాజరైన ప్రజలకు వినిపించామన్నారు. ఎటువంటి అక్షేపణలు రైతులనుండి రాలేదని తహసీల్దార్ తెలిపారు. పెద్దకాంపల్లె గ్రామ విస్తీర్ణం ఆర్.ఎస్.ఆర్ మేరకు 110.16 ఎకరాలుగా గతంలో నమోదు అయివుందని, రీసర్వే మేరకు 109.13 ఎకరాలుగా రికార్డు అయిందని తెలిపారు. గ్రామసభలో రీసర్వే డీటీ ఏకాంత్, మండల సర్వేయర్ సుదర్శన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకులకు అవగాహన

వేంపల్లె : రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయ పరిధిలో చదువుతున్న విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు అన్ని ట్రిపుల్‌ఐటీలలో పనిచేస్తున్న బోధన సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. శనివారం స్థానిక ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ఈనెల 4, 5 తేదీలలో రెండు రోజులు పాటు అంతర్గత నాణ్యత హామీ విభాగం ఆధ్వర్యంలో సమగ్ర వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్‌కు వనరుల వ్యక్తిగా జలంధర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ తంగేళ్లపల్లి శ్రీనివాస్ హాజరయ్యారు. ముందుగా బోధన సిబ్బందికి ఓబీఈ సూత్రాలు, అమలుపై అవగాహనను పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఓబీఈ యొక్క ప్రధాన భావనలు, ఆధునిక విద్యలో దాని ప్రాముఖ్యత, పాఠ్యాంశాల రూపకల్పన, మూల్యాంకన పద్ధతులు, ఆశించిన అభ్యాస ఫలితాలను సాధించడంలో అధ్యాపకుల పాత్రపై లోతైన సెషన్లను అందించారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా ఆర్జీయూకేటీలో విద్యా నైపుణ్యం విద్యార్థి – కేంద్రీకృత అభ్యాసానికి గణనీయంగా దోహదపడుతుందని భావించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి రవికుమార్, ఐక్యూఏసీ డీన్ కోటేశ్వరి, కోఆర్డినేటర్ పి.నాగరాజు, నాలుగు ట్రిపుల్‌ఐటీల ఆధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుంచి చాతుర్మాస వ్రత దీక్షలు

లింగాల : మండలంలోని వెలిదండ్ల గ్రామంలో వెలిదండ్లలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వరద రాజులస్వామి ఆలయంలో ఆదివారం నుంచి చాతుర్మాస వ్రత దీక్షలు నిర్వహిస్తున్నామని భాగవత నిర్వాహకులు తెలిపారు. ఆషాడ మాసం 6వ తేదీ ఆదివారం నుంచి నవంబర్ 5వ తేదీ వరకు శ్రీచాతుర్మాస వ్రత దీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు దాతలు, గ్రామ పెద్దలు, గ్రామస్తుల సహాయ సహకారాలతో ఈ దీక్షలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

క్రాఫ్ లోన్ రైతులకు అవగాహన కార్యక్రమం

సింహాద్రిపురం : ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో క్రాప్ లోన్ తీసుకున్న ప్రతి రైతు పంట ఇన్సూరెన్స్ ప్రీమియం వద్దనుకున్నా రైతులు తప్పనిసరిగా ఓపీటీ అవుట్ ఫారాన్ని తప్పనిసరిగా బ్యాంకులో అందజేయాలని ఆ బ్యాంకు మేనేజర్ కృష్ణకిశోర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 1వ తేదీ నుంచి జులై 15వ తేదీ వరకు రెన్యువల్ చేసుకున్న, చేసుకోబోతున్న రైతులు సాగు చేసిన పంట, ఎకరాల ప్రకారం ఇన్సూరెన్స్ ప్రీమియం మీ లోన్ అకౌంట్‌లో డెబిట్ చేయడం జరుగుతుందన్నారు. క్రాప్ ఇన్సూరెన్స్ అవసరం లేని వారు బ్యాంకును సంప్రదించి ఓపీటీ అవుట్ ఫారాన్ని ఈనెల 15వ తేదీలోగా అందజేయాలన్నారు. ప్రీమియం చెల్లించని రైతులు తప్పనిసరిగా బ్యాంకు వారికి సంప్రదించాలన్నారు.

అన్నదానం గొప్పది

కమలాపురం : దానాలలో కెల్లా అన్నదానం గొప్పదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు సాయినాథ శర్మ తెలిపారు. శనివారం మండలంలోని పెద్దచెప్పలిలో జరిగిన మొహర్రం వేడుకల్లో భాగంగా ఆయనే స్వయంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పీర్ల చావిడి కమిటీ పెద్దల ఆహ్వానం మేరకు ఆయన మొహర్రం వేడుకలకు హాజరయ్యారు. అలాగే ఒంటెద్దు పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

కొత్త ట్రైన్ సర్వీస్ ప్రారంభం



హైదరాబాద్ నుంచి వచ్చిన కొత్త ట్రైన్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజలు

జమ్మలమడుగు రూరల్ : హైదరాబాద్-తిరుపతి కొత్త ట్రైన్ సర్వీస్‌ను అధికారులు ప్రారంభించారు. శుక్రవారం సాయంత్రం నాందేడ్ నుంచి ప్రారంభమైన ట్రైన్ బాసర, నిజామాబాద్ కామారెడ్డి మీదుగా చర్లపల్లి, నల్గొండ, మిర్యాల గూడ, నడికుడి మీదుగా వినుకొండ, దొనకొండ, మర్కాపురం, కంభం, గిద్దలూరు, నంద్యాల, జమ్మలమడుగు రైల్వేస్టేషన్‌కు ఉదయం 8.50కి ప్యాసింజర్ ట్రైన్ చేరుకుంది. ఈ సందర్భంగా జమ్మలమడుగు పట్టణ ప్రజలు ట్రైన్‌కు స్వాగతం పలికారు. అనంతరం తిరుపతికి వెళ్లింది. వారంలో 3 రోజుల పాటు హైదరాబాద్-తిరుపతికి ట్రైన్ సర్వీస్ ఉంటుందని అధికారులు తెలిపారు. రాబోవు రోజుల్లో బెంగళూరు, చెన్నై ప్రాంతాలకు ట్రైన్ సర్వీస్ ఏర్పాటు చేస్తే ప్రజలకు మరింత బాగుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి



పెద్దపుత్తలోని పీర్ల చావిడి వద్ద స్థానికులకు సూచనలిస్తున్న ఎస్ఐ



కొండాపురం : ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ రియాజ్ అహమ్మద్

వల్లూరు : నిర్వాహకులు మొహరం వేడుకలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్ఐ పెద్దఓబన్న తెలిపారు. మొహర్రం వేడుకలకు ఏర్పాట్లు చేసిన మండలంలోని పలు గ్రామాలను శనివారం ఆయన సందర్శించారు. పెద్దపుత్త పీర్ల చావిడి వద్ద స్థానికులతో ఆయన మాట్లాడారు. మొహర్రం జరుపుకునే మండల పరిధిలోని గ్రామాలకు చెందిన నిర్వాహకులు ముందుగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా భద్రత ఏర్పాటు చేస్తామన్నారు.

కొండాపురంలో..

కొండాపురం : మండలంలోని ఫ్యాక్షన్ గ్రామాల్లో మొహర్రం పండుగను ప్రతి ఒక్కరు సంతోషంగా జరుపుకోవాలని ప్రొద్దుటూరు ఫ్యాక్షన్ జోన్ సీఐ రియాజ్‌అహమ్మద్ తెలిపారు. శనివారం వెంకయ్య కాలువ, ఎస్.తిమ్మాపురం గ్రామాల్లో పీర్ల పండుగ సందర్భంగా ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో ఏ సమస్య వచ్చిన వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఫ్యాక్షన్ ఎస్ఐ ద్వారక, కొండాపురం ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులకు చెబుతున్నా.. వడ్డీతో సహా తీర్చుకుంటా..



క్యూ ఆర్ కోడ్ రిలీజ్ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు



కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : జిల్లాలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడం తగదని, ఇంతకు ఇంత, వడ్డీతో సహా తీర్చుకుంటానని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి అధికారులను హెచ్చరించారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి అధ్యక్షతన బాబు షూరిటీ... మోసం గ్యారంటీలో భాగంగా రీకాలింగ్ చంద్రబాబుస్ మెనిఫెస్టో కార్యక్రమంలో మెనిఫెస్టో క్యూ ఆర్ కోడ్‌ను ఆయన ఇతర నాయకులతో కలసి విడుదల చేశారు. ముందుగా మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రీకాలింగ్ చంద్రబాబుస్ మెనిఫెస్టో పై మాట్లాడిన వీడియోను బిగ్ స్క్రీన్‌పై ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న పార్టీలు, కులాలు, మతాలు, వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. ప్రస్తుతం చంద్రబాబే డైరెక్ట్‌గా వైఎస్సార్ సీపీ వాళ్లకు పనులు చేయవద్దని బాహాటంగానే చెప్పడం దారుణం అన్నారు. ఈ 14 నెలల కాలంలో చంద్రబాబు చేసిందేమీ లేదని, కేవలం రూ. 1.70 లక్ష కోట్లు అప్పు చేయడం తప్పా అన్నారు. ఈ నిధులు కనీసం అభివృద్ధికో, సంక్షేమానికో వినియోగించలేదని మండి పడ్డారు. అలాగే జిల్లాలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, అధికారంలోకి రాగానే అంతకు అంత, వడ్డీతో సహా తీర్చుకుంటానని అధికారులను హెచ్చరించారు. కేసులకు భయపడ వద్దని, తాను అన్ని విధాలా ఆదుకుంటానని, భవిష్యత్తులో టీడీపీ ఉండదని, టీడీపీని తొక్క ఆవతల పడేస్తానడంతో కార్యకర్తల్లో హర్షధ్వానాలు మిన్నంటాయి. జగన్ 2.0లో కార్యకర్తలకు మంచి భవిష్యత్తు ఉంటుందని, కార్యకర్తలే పట్టుకొమ్మలని జగనన్నే పలు సందర్భాల్లో చెప్పారని గుర్తు చేశారు. త్వరలో జరిగే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో అన్ని స్థానాలు మనమే గెలవాలని, అందుకు తగినట్టుగా మనమంతా సంసిద్ధం కావాలన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచన మేరకు చేపట్టే రీకాల్ చంద్రబాబుస్ మెనిఫెస్టోను ఇంటింటికి తీసుకెళ్లాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. మెనిఫెస్టో గురించి మాట్లాడే హక్కు ఒక్క వైఎస్సార్ సీపీకే, ఒక్క జగన్ మోహన్‌రెడ్డికే ఉందన్నారు. ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు కొత్తేమీ కాదని, పుట్టుకతోనే చంద్రబాబుకు మోసం చేయడం వచ్చిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు సాయినాథశర్మ తెలిపారు. మండలాల కన్వీనర్లు ఉత్తమారెడ్డి, వీరారెడ్డి, జీఎస్ భాస్కర్ రెడ్డి, రఘునాథరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, కడప అర్బన్ కన్వీనర్ నిత్యానందరెడ్డి, జెడ్పీటీసీలు రాజశేఖర్ రెడ్డి, దిలీప్‌రెడ్డి, ఎంపీపీలు భారతి, సురేష్ యాదవ్, జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు నాగేంద్రరెడ్డి, డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ సుబ్బారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సాదిక్, తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయలు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, గంగాధర్ రెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, ఇస్మాయిల్, హిదాయత్, జావీద్, ప్రతాప్‌రెడ్డి, శంకర్ రెడ్డి, చెన్నకేశవరెడ్డి, లక్ష్మీ నారాయణరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు,ఎంపీపీలు, భారీ ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.